
కథ

**''గోల్డ్ లోను తీసుకోవడానికికొచ్చిందెవరు?''
బ్యాంకులో ప్యూను పెద్దగా అరిచేసరికి
పరువుపోయినట్లు ఫీలయ్యాను. వేగంగా లేచి
ఎవరైనా తెలిసిన వాళ్లున్నారేమోనని,
చుట్టూ చూసి, ధబాల్న మెడలో వున్న
చెయిన్ అయిష్టంగా తీసి, అరచేతిలో
పట్టుకుని మెల్లగా మేనేజరు
గదిలోకి నడిచాను.**



# గురుతులు

## ఎం. వెంకటేశ్వరరావు

తలుపు తీసిన శబ్దం విని 'ఎస్' అని తలెత్తిన మేనేజర్ని చూసి నోట మాట రాలేదు. యూనివర్శిటిలో నా క్లాస్‌మేట్ దివ్య. కళ్లు నమ్మలేని నిజాన్ని చూస్తున్నట్లు రెప్పవాల్చడం మరిచిపోయాను. నా కాళ్లు కొద్దిగా తడబడ్డాయి.

''భూమి గుండ్రంగా వుందంటారు. కానీ.... మరీ ఇంత చిన్నదా?'' అనుకున్నాను. ఇంత త్వరగా ఆమెని కలుస్తానని అనుకోలేదు.

పెళ్లికి ముందు దివ్య రాసిన చివరి ఉత్తరంలో...

''భూమి గుండ్రంగా వుంటుంది భాస్కర్! మళ్లీ మనం తప్పక కలుస్తాం. ఆ నమ్మకం నాకుంది'' అన్నది.

భూమి గుండ్రంగా వుంటుందన్న విషయం ఈ విధంగా నిరూపించబడనక్కర్లేదనిపించింది.

ఎవరో అనుకొని కాస్త ఆలస్యంగా తలెత్తిన దివ్య నన్ను చూసిన ఆశ్చర్యంలో సీట్లో నుంచి లేచి నిలుచుంది. ఆమె నోటి నుంచి మాట రాలేదు. ప్రయత్నం మీద 'భాస్కర్....' అంది పొడిగా....

నాకూ నోటి నుంచి మాట పెగలడం లేదు.

కాలింగ్ బెల్ శబ్దమవడంతో 'కూచో భాస్కర్' అని, వచ్చిన వాళ్లని పంపించింది.

నేనింకా ఏదో భ్రమలోనే ఉన్నట్టుగానే అనుకుంటూ, ఆమె ఎదురుగా వున్న కుర్చీలో కూచున్నాను.

''దివ్యా! నువ్విక్కడే.. వుంటున్నావా?'' అన్నాను.

''లేదు... ఈ బ్రాంచి మేనేజరు పదిరోజుల లీవులో వెళ్లాడు. డిప్యూటేషన్ మీద వేశారు నన్ను. మళ్లీ ఇంత త్వరగా నిన్ను కలుస్తానని అనుకోలేదు. ఈజ్ ఇట్ రియల్?''అంది కూచుంటూ.

''నాకూ నమ్మశక్యంగా లేదు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఈ కోపరేటివ్ బ్యాంకులో ఈ గదిలో ఇలా ఇద్దరం... అచ్చం సినిమాలోలా లేదూ..'' అన్నాను.

''నువ్విక్కడే రైల్వేలో ఉద్యోగం చేస్తున్నావని జ్యోతి చెప్పింది.''

''అవునిక్కడే... రైల్నిలయంలో''

''పెళ్లి...''

''ఊ..హూ..''

''ఇంకా మీ ఇంటి ప్రాబ్లమ్స్ తీరలేదా?''

''ప్చ్....''

''గోల్డ్ లోన్ కోసం వచ్చిందీ....''

''నేనే.... మా అవనిజ డెలివరీ.... హాస్పిటల్ బిల్లు కట్టాలి. ''

''వస్తువేది?''

సంకోచిస్తూనే... నా చేతిలో వున్న గోల్డ్ చెయిన్ ఆమె ముందుంచాను. దాన్ని చూస్తూనే దివ్య మొహంలో రంగులు మారడం గమనించి....

''వేరే సోర్స్ లేక...'' అనేసరికి, దివ్య తలొంచుకుంది. మా ఇద్దరి ఫ్రెండ్‌షిప్ వృద్ధయ్యే రోజుల్లో... పిజి ఫస్టియర్‌లో నేను యూనివర్శిటీ సెకండ్ వచ్చినందుకు దివ్య నాకిచ్చిన గిఫ్ట్ ఈ గోల్డ్‌చెయిన్.

''దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ తియ్యకూడదు'' అని కండీషన్ కూడా పెట్టింది.

ఆ క్షణంలోనే నా వేలికున్న గోల్డ్ రింగ్ తీసి ఆమె వేలికి తొడిగాను. అది ఇప్పటికీ ఆమె వేలికుంది. అది నేను చూడాలని చేతి వేళ్లని నా ముందుకు చాపింది.

తలెత్తి దివ్య ముఖంలోకి చూసి స్టన్నయ్యాను. దివ్య కళ్లల్లో చిప్పిల్లిన కన్నీళ్లు చూసిన నా హృదయం సుడిగుండం అయ్యింది. ఆర్తిగా ఓదార్చాలన్న ఆత్రం. కానీ ఇప్పుడామె వేరొకరకి సొంతం. ఆ థాట్ రాగానే నా ఆత్రం గోడకు కొట్టిన రబ్బరు బంతిలా వెనక్కి మళ్లింది.

వెంటనే సంబాళించుకున్న దివ్య బజర్ నొక్కింది. లోపలికొచ్చిన ప్యూన్‌తో.... అప్రైజర్ని రమ్మను అంది. బంగారం విలువ కట్టే అప్రైజర్ రావడంతో ''ఇది ఎంతుందో చూసి, ఫామ్ ఫిల్ చేసి తీసుకురండి'' అన్చెప్పి పంపింది.

''ఎంత కావాలి భాస్కర్?''

''..............''

''ఒక గ్రాముకి మూడొందలిస్తుంది బ్యాంకు'' అంది దివ్య అప్పజెప్పినట్లు.

''మాగ్జిమమ్ ఎంతొస్తే...అంతే'' అన్నాను నేను తలొంచుకొని. నేను పడుతోన్న మానసిక అవస్థ గ్రహించినట్లు లేచి...

''పది నిమిషాలు బయటికెళ్దాం నాతోరా!



ఈ లోపల ఫార్మాలిటీస్ పూర్తవుతాయి'' అని బయల్దేరింది. దివ్యను అనుసరించక తప్పలేదు.

బ్యాంకు ఎదురుగా వున్న వసంత్ భవన్ వెళ్లి ఫ్యామిలీ సెక్షన్‌లో ఓ మూలగా వున్న టేబుల్ దగ్గర కూచున్నాం. చీకటి మూసిన ఏకాంతం ఇద్దరి మధ్యా మాటల్ని మింగేసింది. బేరర్‌కి రెండు స్ట్రాంగ్ కాఫీ ఆర్డరిచ్చింది దివ్య.

ఎదురుగా మౌనంగా కూచున్న దివ్యతో మనసు విప్పి, గతమంతా గురుతు చేసుకుంటూ.... స్వాంతన పొందాలని మనసువ్విళ్లూరుతోంది. తల దించుకున్న దివ్య వైపు చూసిన కళ్లు....క్షణకాలం మనసుతో జత కలసి జ్ఞాపకాల వైపు తొంగి చూశాయి.

***

ఫస్టియర్ రిజల్ట్సు చూసి వేగంగా దివ్యకోసం పరిగెత్తుకొచ్చిన నన్ను పక్కకి పిలిచి, నా చెవి పక్క నుండి కారుతున్న స్వేదాన్ని ఊదుతూ, చెప్పిన గుసగుసలు గుర్తొచ్చాయి.

''వర్షంలో ఒకే గొడుగులో ఒకర్నొకరు ఆనుకుంటూ బస్టాండుకొచ్చి... ఆఖరి బస్సు వచ్చే వరకూ ఆపకుండా చెప్పుకున్న కబుర్లు చెవుల్లో మార్మోగటం ప్రారంభించాయి.'' ఇలా ఎన్నెన్నో దివ్యతో పంచుకోవాలనుకున్న జ్ఞాపకాల గొంతు ఎవరో నొక్కేసినట్లు పెదవి దాటి బయటకి రానని మొరాయిస్తున్నాయి.

మనసంతా మొద్దుబారినట్టయింది.

నా వైపు చూసిన దివ్య సడన్‌గా తన ఎడమ చెయ్యి చూపుడు వేలు కింది పెదవి మీదుంచుకొని తనకే సొంతమైన చిర్నవ్వు నవ్వింది. నాకు మళ్లీ పాత జ్ఞాపకాల నిల్వల్నించి కొన్నిటిని మనసు ప్రొజెక్టర్ చిత్రాలుగా కళ్ల ముందు చూపసాగింది.

ఇంతలో ఇంటర్వెల్ అన్నట్లు బేరర్ కాఫీ తెచ్చాడు. కాఫీ సిప్ చేస్తూ ''ఊ.. సంగతులు ఏంటి? చెప్పు?'' అంది

''నథింగ్... నథింగ్'' గొణిగాను.

మళ్లీ మౌనం...

ఫెయిలయిన మా ప్రేమకథని గుర్తు చేస్తుందని, ఎంతగానో కావాలనుకొని ఎవరికి వారయి వేరయినందుకు బాధపడుతుందని.. అలాగే ఓడిపోయిన నా ప్రేమ... హృదయంలో చిరకాలం దివ్య జ్ఞాపకాలతో సజీవంగానే వుంటుందని ఆమెకి చెప్పాలని.. ఒకర్నొకరు కనీసం ఓదార్చు కోవాలని ఆశించాను.

కానీ ఆశించని విధంగా దివ్య

''నీకిప్పుడు ముప్ఫయ్యేళ్లు దాటాయి గదా భాస్కర్...పెళ్లి చేసుకోకూడదూ...''

''కూడదు...''కొట్టినట్టన్నాను. చివాల్న తలెత్తి నా వైపు చూసింది. బాధపడిందనుకుని... మాట మారుస్తూ...

''నువ్వు మీ హబ్బీతో అమెరికాలో వుంటావను కుంటున్నానిన్నాళ్లు.''

''లేదు.... వెళ్లలేదు... ఆయనే వెళ్లారు''

''పిల్లలు?'' మళ్లీ ప్రశ్నించాను.

''ఒక బాబు''

ఆ పై మా ఇద్దరి మధ్యా కాసేపు కుటుంబ విషయాలు, యూనివర్శిటీ మేట్స్ గురించి... మాటలు దొర్లాయి.

''మీ ఆవనిజని ఇంటికి తీసికెళ్లాక ఫోన్ చెయ్యి'' అంది దివ్య బ్యాంకు నుంచి డబ్బు తీసుకుని బయటకొస్తూండగా.

''హూ...పెళ్లయితేచాలు... పాత ప్రేమల్ని పాతేస్తారు గాబోలు ఈ ఆడవాళ్లు. ఆయా సమయాలకి తగ్గట్టు స్టేజీ మీద నటుల్లా నటన పూర్తయ్యాక, పోషించిన పాత్ర గురించి పూర్తిగా మరిచి పోతారల్లే ఉంది. అందుకే ఆడవాళ్ల మనసు సముద్రం కన్నా లోతెక్కువని ఊర్కే అన్నారా!'' అనుకుంటూ భారంగా బయటకొచ్చాను.

***

పదిరోజుల డిప్యూటేషన్ పూర్తయి, ఊర్లెళ్లే రోజు దివ్య నాకు ఫోన్ చేసింది. రైలెక్కించడానికి ఆమెతో స్టేషన్‌కెళ్లాను. మేఘావృతమైన ఆకాశాన్నుంచీ.... ఏక్షణంలోనైనా వరుణుడు కరుణించేదుకు సిద్ధంగా వున్నాడు.

లగేజీ లోపలపెట్టొచ్చా. మౌనంగా నుంచున్న నాతో....''భాస్కర్ త్వరగా పెళ్లి చేసుకో'' అంది దివ్య.

''సరే'' అన్నాను చిర్నవ్వుతో...

సన్నటి వర్షపు తుంపర మొదలయింది.

''వర్షం పడుతోంది దివ్యా! రైల్లో కూర్చో''

''ఫర్వాలేదు భాస్కర్! నీతో ఇలా వర్షంలో తడిసి చాలా కాలమైంది.''

అంతే.... మూగవోయిన వీణ తంత్రుల్ని, దివ్య తన మునివేళ్లతో మీటినట్టన్పించిన అలనాటి భావన ఒక్క క్షణంలో మనసు గోడలు దాటి బయటికొచ్చింది వేగంగా..

వర్షపు చినుకులు దివ్య మొహం మీద పడుతున్నాయి. సిగ్నల్ ఎల్లో రంగుకి మారింది. ''దివ్యా! సిగ్నలిచ్చారు రైలెక్కు''

దివ్య మొహం క్షణంలో గంభీరంగా మారింది. నా కళ్లలోకి సూటిగా చూసింది. ఆ చూపు తొలిసారి ఆమెని చూసినప్పుడు ఆమె కళ్లు నా ప్రేమను ''స్వాగతించినట్టన్పించే'' చూపులా అనిపించింది.

వర్షం పెద్దదవ్వ సాగింది.

''దివ్యా! ప్లీజ్!'' అన్నాను ఆర్ద్రమయిన గొంతుతో...

''భా..స్క..ర్''అందామె సజల నయనాలతో...

ఆ పై ఇద్దరికీ మాట పెగల్లేదు.

మెట్లెక్కి నుంచున్న విద్య గబగబా హ్యాండ్ బ్యాగ్ తెరిచి ఓ కవరు నాచేతిలో వుంచి, ''వస్తాను భాస్కర్'' అంది జీరబోయిన గొంతుతో. ఆమె కళ్లలోకి చూసే ధైర్యం లేక తల వంచుకునే 'టాటా'చెప్పడానికి చేతులు గాల్లోకి లేపాను. ప్లాట్‌ఫారం దాటి, కనుమరుగయ్యేంత వరకూ, చెయ్యి 'టాటా'చెప్తూనే వుంది. కనుకొలకులు దాటి దిగుతున్న అశ్రువులు మొహం మీద పడుతున్న వర్షపు చినుకుల్లో కలిసిపోతున్నాయి. వర్షం పెద్దదయింది. స్టేషన్లో గోడ పక్కనున్నుంచుని దివ్య ఇచ్చిన కవరు చించాను. అందులో నేను బ్యాంకులో తాకట్టు పెట్టిన గోల్డ్ చెయిన్‌తో పాటు, ఓ లెటర్ వుంది. కళ్లు వేగంగా లెటర్లోని అక్షరాల వెంట పరుగెత్తసాగాయి.

భాస్కర్!

ఓ మగాడు ప్రేమలో ఓడిపోతే కవిత రాయొచ్చు. కథ రాయొచ్చు. సినిమా కూడా తియ్యొచ్చు. ఇంకా చెప్పాలంటే భార్య దగ్గర తన ప్రేమ కథ వినిపించి, ''నా మొగుడు నా దగ్గర ఏదీ దాచడు అన్న సర్టిఫికెట్ కూడా పొందొచ్చు.

అదే ఆడవాళ్లయితే...! ఊరంతా నిద్రించాక నిశిరాత్రిలో కటికీలోంచి కనిపించే ఆకాశాన్ని చూస్తూ, జ్ఞాపకాల్ని నెమరు వేస్తూ..కన్నీరు కార్చడం మినహా, ధైర్యం చేసి ఎవరితోనూ చెప్పుకోలేరు. చాలా రోజుల తర్వాత నిన్ను చూసిన వెంటనే, మనసు మ్యూజియంలో భద్రపరిచిన మన ప్రేమ జ్ఞాపకాల్ని నీతో పంచుకోవాలని మనసు తొందర చేసింది. అయినా నిగ్రహించు కున్నాను. కారణం... ఆ జ్ఞాపకాలు తిరిగి తవ్వితే.... నన్ను నేను కంట్రోలు చేసుకోలేను. కొన్ని కొన్ని హృదయంలో నిద్రిస్తేనే హాయిగా వుంటుందేమో!

నా హజ్బెండ్ అమెరికాలో ఉన్నాడని అబద్ధం చెప్పాను. పెళ్లయిన వెంటనే, తన వెంట యుఎస్‌కి తీసుకెళ్తానన్న నా భర్త నాకు వీసా రాని కారణంగా నన్నిక్కడే వదిలి వెళ్లాల్సి వచ్చింది. పోయిన సంవత్సరం నన్నూ బాబుని తీసుకెళ్లడానికి ఇండియా వచ్చారు. విజయవాడలో వున్న తల్లిదండ్రుల్ని చూడడానికి కార్లో వెళుతూ, రోడ్ యాక్సిడెంట్‌లో మరణించారు. కొడుకుని కోల్పోయిన అత్త మామలతో, తండ్రిలేని నా కొడుకుతో, ఊరట కోసం ఈ ఉద్యోగంతో.... ప్రస్తుతం ఎక్కడ? అని అడగకు.

గోల్డ్ చెయిన్ బ్యాంకులో డబ్బు కట్టి విడిపించాను. దీనిని నీ మెడ నుంచి వేరు చెయ్యకు. తట్టుకోలేను. నువ్వు నా వేలికి తొడిగిన ఈ రింగ్ ఇప్పటి వరకూ ఒక్క క్షణం కూడా నా వేలుని వదల్లేదు. చావు లేని జ్ఞాపకాలుగా విడదీయలేని ''గురుతులు''గా వీటిని మనతోనే మిగిలిపోనీయ్.

త్వరగా పెళ్లి చేసుకో..

భూమి గుండ్రంగానే వుంటుందెప్పుడూ. మళ్లీ ఎప్పుడో, ఎక్కడో తప్పక కలుస్తాం..

-దివ్య

లెటర్ చదవడం ముగించి చేతిలో వున్న చెయిన్‌ని మెడలో వేసుకొన్నాను, ఆమె గుర్తుకి గురుతుగా...

*



## ప్రేమలో తమన్నా

'హేపీ డేస్' సినిమా తర్వాత తెలుగులో మంచి డిమాండ్‌లో ఉన్న తమన్నా ప్రస్తుతం ప్రేమలో పడి మునకలేస్తోందని వినికిడి. ఈ మధ్య ఎ.ఎం. రత్నం కుమారుడు రవి కృష్ణతో తరచూ రెస్టారెంట్లలో కనిపిస్తోందట. '7జి బృందావన్ కాలనీ'తో మంచి ఇమేజ్ సంపాదించుకున్న రవికృష్ణ తరువాత రెండు చిత్రాల్లో నటించినా అవి పెద్దగా ఆడలేదు. తమన్నా మాత్రం ఇక్కడే కాక తమిళంలో కూడా మంచి గుర్తింపు తెచ్చుకుంది. సూర్య, ధనుష్‌లాంటి పెద్ద హీరోల సరసన నటిస్తోంది. ప్రస్తుతం తమిళంలో సిమ్రాన్ తర్వాత ఆ స్థానాన్ని భర్తీ చేయనుంది తమన్నాయేనని అక్కడి ప్రేక్షకుల అభిప్రాయమట. ఇప్పుడు రవి కృష్ణ, తమన్నా కలిసి 'నిన్న నేడు రేపు' అనే సినిమాలో నటిస్తున్నారు. ఈ షూటింగ్ సమయంలోనే వీరిద్దరూ దగ్గరయ్యారట! ఇది వివాహం దాకా చేరే ప్రేమా లేక సినిమా ప్రేమలన్నింటిలాగా బుద్బుద ప్రాయమా అన్నది వేచి చూడాలి.